వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
గురువారం, ఆగస్టు 13, 2026

# ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- కుత్బుల్లాపూర్‌లో ఘనంగా 'తిరంగా ర్యాలీ'





**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఐడీపీఎల్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ "తిరంగా ర్యాలీ" నిర్వహించారు. ఈ ర్యాలీలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని సందడి చేశారు. జాతీయ జెండాను చేతబూని స్వయంగా ర్యాలీలో నడిచిన ఎంపీ ఈటల రాజేందర్.. దేశ స్వాతంత్ర్య వోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభిన్న జాతులు, సంస్కృతులు, భాషలు ఉన్నప్పటికీ అన్నీ మరిచి కలిసి జీవించే ఏకైక దేశం భారతదేశమని అన్నారు. మనందరం భారతమాత ముద్దుబిడ్డలమని గర్వంగా పేర్కొన్నారు. 'జనగణమన', 'వందేమాతరం' వంటి జాతీయ భావనలు అసేతు హిమాచలం భారతీయులందరినీ ఒకేతాటిపై ఐక్యంగా ఉంచుతున్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సమర్థవంతమైన నాయకత్వంలో ప్రపంచ పటంపై భారతదేశ ఔన్నత్యం నానాటికీ సమున్నతంగా నిలుస్తోందని కొనియాడారు. దేశ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మోదీకి ప్రతి ఒక్కరూ చేయూతనిచ్చి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు మరియు ఇంచార్జ్ మల్లారెడ్డి, వడేపల్లి రాజేశ్వర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి, జిల్లా జనరల్ సెక్రెటరీ విగ్నేష్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు శేఖర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శేషగిరి రావు, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ కాంత రావు, కన్వీనర్ శ్రీకర్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల జయశేఖర్ గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, సీనియర్ నాయకులు వేముల రమేష్, బీజేవైఎం నాయకులు శ్రీనాథ్, సాయి కిరణ్ రెడ్డి, ఆర్తిక్ యాదవ్‌తో పాటు పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# విజయ డెయిరీ పార్లర్ ప్రారంభం



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్–10లోని ధర్మ జువెలరీస్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ విజయ డెయిరీ పార్లర్‌ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, తెలంగాణ విజయ డెయిరీ కార్పొరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. విజయ డెయిరీ పార్లర్ ద్వారా ప్రజలకు అత్యంత నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులను సులభంగా అందించేందుకు ఇలాంటి విజయ డెయిరీ పార్లర్లను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ విజయ డెయిరీ ఉత్పత్తులకు ప్రజల్లో మరింత ఆదరణ పెంచేలా, ఎల్లప్పుడూ నాణ్యతకు పెద్దపీట వేస్తూ సంస్థ ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విజయ డెయిరీ అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ



**భీమదేవరపల్లి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప (యూనిఫామ్) స్కూలు దుస్తుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థిని విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సమానత్వ భావనను పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏకరూప యూనిఫామ్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య, కార్పొరేట్ స్థాయి వసతులు ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలస్వామి, విఓ అశోక్, ఉపాధ్యాయులు రాజేందర్, స్టాలిన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- హైదరాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్‌లపై నిరంతరం సర్వే నిర్వహించి, లబ్ధిదారులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవ ఐడిటోరియంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల సర్వే క్రమం తప్పకుండా చేస్తూ.. స్క్రీనింగ్ మరియు సస్పెక్ట్ కేసులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. ఎన్ సీడీ స్క్రీనింగ్‌తో పాటు ఫాలో–అప్ తప్పకుండా చేయాలని ఆదేశించారు. గర్భిణి అని తెలియగానే వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలి. గర్భిణీ స్త్రీలకు అవసరమైన పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు సమర్థవంతంగా నిర్వహించి, పిల్లలందరికీ సంపూర్ణ టీకాలు అందేలా చూడాన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలలో అన్ని రకాల మందులు, పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, మురికివాడల్లోని పేద ప్రజలకు క్రమం తప్పకుండా సేవలు అందించాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలి. ఓపీ సేవలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. హెచ్‌ఎంఐఎస్, ఎంసీహెచ్ పోర్టల్‌లో ప్రతిరోజు సమాచారాన్ని తప్పకుండా నమోదు చేయాలని, లక్ష్యాలు సాధించని ప్రగతిని 15 రోజుల్లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ సాయిబాబా, శ్రీకళ, ఆశ్రిత రెడ్డి, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, ఇంచార్జ్ మలేరియా అధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

- 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు'




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి, వారిని స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ. 12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

**పేద, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత:**

కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ బీసీ మహిళలకు ఈ పథకం ద్వారా ఉపాధి కల్పించడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, అలాగే కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల మేరకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని, కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణ కూడా ఇస్తామని వెల్లడించారు. ఆగస్టు 14 (సాయంత్రం 4 గంటలకు): హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని సీఎం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.